# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-07-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 136వ సంచిక ఈరోజు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.**

**2. కరువు పరిస్థితులను ఎదుర్కొనే పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ సూచించారు.**

**3. యువత చట్టసభల్లో ప్రవేశించి ప్రజాప్రతినిధులుగా వారి భావజాలాన్ని, ఆలోచనలను దేశ భవిష్యతకోసం ఉపయోగించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.**

**4. ఎర్రచందనం అక్రమ రవాణా ముఠాలకు సహకరిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ వెల్లడించారు.**

==========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 136వ సంచిక ఈరోజు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

--------------------------

కరువు పరిస్థితులను ఎదుర్కొనే పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ సూచించారు. బాపట్లలోని వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో నిన్న జరిగిన ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 58వ స్నాతకోత్సవానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. ఎల్‌నినో కారణంగా వ్యవసాయంపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. వాతావరణ మార్పులను వ్యవసాయ విశ్వవిద్యాలయాలు నిరంతరం పర్యవేక్షించి, ప్రభుత్వానికి అవసరమైన ప్రత్యామ్నాయ చర్యలను సూచించాలన్నారు. ప్రస్తుతం వ్యవసాయం రంగం ఎన్నడూ చూడని సవాళ్లను ఎదుర్కుంటోందని గవర్నర్ పేర్కొంటూ..

వాయిస్…27 సెకన్లు

--------------------------

యువత చట్టసభల్లో ప్రవేశించి ప్రజాప్రతినిధులుగా వారి భావజాలాన్ని, ఆలోచనలను దేశ భవిష్యతకోసం ఉపయోగించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాదులో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. దేశంలోని 140 కోట్ల జనాభాలో 30 శాతం యువతీయు వకులున్నా చట్టసభల్లో ఒక్కశాతం మాత్రమే ప్రాతినిధ్యం ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో మార్పురావాల్సిన అవసరం ఉందని తెలిపారు. చట్టసభల్లో పోటీ చేసే వయో పరిమితిని 21 ఏళ్లకు తగ్గించాలని డిమాండ్ చేశారు.

---------------------------

ఎర్రచందనం అక్రమ రవాణా ముఠాలకు సహకరిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వెల్లడించారు. కడప జిల్లా అవధూత కాశినాయన మండల పరిధిలోని వరికుంట్ల గ్రామ సమీపంలోని దేవాలయం వద్ద  కోటి 50 లక్షల రూపాలయ విలువైన 78 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్న ఘటనపై స్పందించిన ఆయన నిన్న ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం అధికారులతో మాట్లాడారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు మరింత కఠినమైన ప్రణాళికలు రూపొందిస్తున్నామని స్పష్టం చేశారు. 'ఆపరేషన్ అరణ్య' ద్వారా ఎర్రచందనం అక్రమ రవాణాను ఏ విధంగా అరికడుతున్నామో ఎప్పటికప్పుడు సమీక్షిస్తానని పేర్కొన్నారు.

---------------------------

బీసీల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ.. బీసీ సంక్షేమానికి గత రెండేళ్లలోనే 50 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేశామని, రానున్న ఐదేళ్లలో ఒక లక్షా  50 వేల కోట్ల రూపాలయలతో ఆర్థిక ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. కొత్తగా 10 మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులాలను ఏర్పాటు చేసి, అదనంగా 5 వేల మంది విద్యార్థులకు విద్యా అవకాశాలు కల్పిస్తున్నట్లు మంత్రి పేర్కొంటూ..

వాయిస్...27 సెకన్లు

---------------------------

అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ వేడుకల్లో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. విశాఖపట్నం కలెక్టరేట్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులతో విమానాశ్రయ ప్రారంభోత్సవంపై మంత్రి సమీక్షా సమావేశాన్ని నిన్న నిర్వహించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు, ఆహారం, భద్రతతో పాటు రవాణా సౌకర్యాలను పకడ్బందీగా కల్పించాలని సూచించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల కోసం బస్సుల రూట్ మ్యాప్, సమయ ప్రణాళికను సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు.

---------------------------

నీటి సంరక్షణ, నిర్వహణతో పాటు, వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం జలశక్తి అభియాన్లో వర్షపునీరు ఒడిసిపట్టడం "క్యాచ్ ది రైన్" అనే కార్యక్రమాన్ని చేపట్టింది. దేశవ్యాప్తంగా అనేక జిల్లాలలో ఈ ప్రచారాన్ని నిర్వహిస్తోంది. ప్రజలు వర్షపు నీటిని సేకరించి, భవిష్యత్తులో  ఉపయోగించుకునేలా ప్రోత్సహించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా నీటి భద్రత, వర్షపు నీటి

సంరక్షణ, భూగర్భ జలాల పునరుజ్జీవనం ప్రాముఖ్యతపై పలు అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో మరో 10 కొత్త కోవిడ్ కేసులు నమోదయ్యాయని వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది. గుంటూరు జిల్లాలో ముగ్గురు, ఎన్టీఆర్ జిల్లాలో ఇద్దరు, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కృష్ణా, తిరుపతి, విశాఖపట్నం జిల్లాల్లో ఒక్కొక్కరికి పాజిటివ్ నిర్ధారణ అయ్యిందని నిన్న విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. దీంతో రాష్ట్రంలో మొత్తం కోవిడ్ కేసుల సంఖ్య 49కు చేరిందని తెలిపింది. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 302 మందికి కోవిడ్ పరీక్షలు నిర్వహించినట్లు వైద్యారోగ్య శాఖ వెల్లడించింది. ప్రస్తుతం బాధితుల్లో 24 మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా, మరో 16 మంది ఇంటివద్ద వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు.

---------------------------

ఎల్‌నినో కారణంగా కష్టాల్లో ఉన్న రైతులకు సూక్ష్మ సేద్య పరికరాలను పంపిణీ చేసి అండగా నిలవాలని తెలంగాణ వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఆయా సంస్థలకు బకాయిలను త్వరలోనే చెల్లిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయా కంపెనీల ప్రతినిధులతో నిన్న నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... ఎల్‌నినో దృష్ట్యా సాగునీటి సద్వినియోగానికి సూక్ష్మసేద్యాన్ని పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ సీజన్‌లో 2 లక్షల 38 వేల ఎకరాల లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు తెలిపారు. అనుమతులు వచ్చిన వెంటనే రైతులకు అవసరమైన పరికరాలను సరఫరా చేయాలని కంపెనీ ప్రతినిధులకు సూచించారు. ఈ క్రతువులో వ్యవసాయ, ఉద్యాన శాఖలు సమన్వయంతో వ్యవహరించి లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు.

---------------------------

వాయువ్య బంగాళాఖాతం, పరిసర గంగాపరివాహక పశ్చిమ బెంగాల్– ఉత్తర ఒడిశా తీరాలపై అల్పపీడనం కేంద్రీకృతమై ఉందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా, యానాంలో ఈరోజు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్ర అధికారిణి జి. లక్ష్మి పేర్కొంటూ..

వాయిస్...20 సెకన్లు

తెలంగాణలో రానున్న 3 రోజు పాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడిచింది.

---------------------------

గుంటూరు జిల్లా ఉండవల్లి గుహల వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ఆధ్వర్యంలో రెండు రోజుల 'తెలుగు మహోత్సవం' కార్యక్రమం నిన్న ప్రారంభమైంది. ఉదయం 6:30 గంటలకు "సూర్యోదయ సుప్రభాతం" పేరుతో విజయవాడలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ, సంగీత నృత్య కళాశాల విద్యార్థులు భక్తిగీతాలు ఆలపించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. యువతలో మాతృభాషాభిమానాన్ని నింపడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

=====================